చాపరాయి నిధులు పంచాయతీకి కేటాయించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతానికి వస్తున్న నిధులను స్థానిక పోతంగి పంచాయతీకి కేటాయించాలని సర్పంచ్ వి వెంకటరావు, ఉప సర్పంచ్ ఎస్ జగ్గు నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పంచాయితీ పరిధిలోని పర్యాటక కేంద్రంలో ఐటిడిఏ సుమారు గత రెండేళ్ల క్రితం విలీనం చేసుకుని నిర్వహణ కొనసాగిస్తుందన్నారు. అక్కడ వచ్చిన నిధులను స్థానిక పంచాయతీకి ఒక్క పైసా కూడా కేటాయించడం లేదన్నారు. బొర్ర గృహాల్లో పంచాయతీకి 30 శాతం నిధులు కేటాయిస్తున్నారని, ఆ విధంగానే ఇక్కడ కూడా కేటాయించాలని డిమాండ్ చేశారు. దీంతో పంచాయితీకి కొంత శాతం అభివృద్ధి చేయడం జరుగుతుందని చెప్పారు. దీంతోపాటు వాహనాల పార్కింగ్‌ను పంచాయితీకి కేటాయించి టెండర్ వేలంపాట నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక పంచాయతీ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ సర్వేను నిలుపుదల చేయాలి

▶▶ జెడ్‌పిటిసి గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

▶▶ కలెక్టరేట్ సమావేశంలో తెల్చి చెప్పిన నేతలు

ప్రజాశక్తి-పాడేరు : 1/70, పీసా, అటవిహక్కుల చట్టాలను ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అదానీ ఎనర్జీ, నవయుగ కంపెనీతో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని పెదకోట హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ సామర్థ్యం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జివో 51 రద్దు చేయాలని, అనంతగిరి జడ్పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర జిల్లా కలెక్టర్‌ను కోరారు. అనంతగిరి మండలం పెదకోట, గుజ్జేలి, చిట్టెంపాడు ప్రాంతంలో అదానీ, నవయుగ ప్రైవేట్ కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి గ్రామాల సర్వే నిలుపుదల చెయ్యాలని పాడేరు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఈ విషయంపై జరిగిన సమావేశంలో కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఎదుట వారు స్పష్టం చేశారు. ఈ సమావేశానికి అనంతగిరి ఎంపిపి శెట్టి నీలవేణి, అరకు జడ్పిటిసి శెట్టి.రోషిణి హాజరై హైడ్రో ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. ఆదివాసుల హక్కులు, చట్టాలకు తీవ్ర నష్టం కల్గిస్తున్న అదానీ ఎనర్జీ, నవయుగ ప్రైవేట్ కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంలో సర్వే నిలిపి వెయ్యాలని కలెక్టర్ కి పిర్యాదు చేశారు. ఆదివాసుల హక్కులు, చట్టాలకు, ఆదివాసుల అస్తిత్వానికి భంగం కలిగిస్తున్న అదానీ, నవయుగ కంపెనీలతో చేసుకున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ ఒప్పందాలను రద్దు చేయాలని తెలిపారు. అనంతగిరీ మండలంలో పెదకోట, చిట్టంపాడు, గుజ్జేలి ప్రాంతాల్లో నిర్మిస్తున్న హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌లతో 10 పంచాయితీ ల్లో 50 గ్రామాల్లో సుమారు 10 వేల మంది ఆదివాసుకు ఇబ్బంది కలుగుతుందని, ఈ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. పెదకోట గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ సామర్థ్యాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జివో 51 రద్దు చేయాలఆన్నరు. కలెక్టర్‌తో గంట పాటు చర్చించిన అనంతరం హైడ్రో పవర్ ప్రోజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని ప్రజా ప్రతినిధులు, పీసా కమిటీ సభ్యులు గ్రామస్తులు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పాంగి.అప్పారావు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ మదీన గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్ బాబు పెదకోట గ్రామానికి చెందిన ఆనంద్, ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పాల్గొన్న నేతలు

జిఓ 51ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని పలు పంచాయితీల పెసా ఉపాధ్యక్ష, కార్యదర్శిలు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎం ఎం శ్రీను పాల్గొన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ, ఆదివాసి గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం, పెస వంటి పటిష్టమైన చట్టాలు ఉన్నప్పటికీ వాటిని కాలరాస్తూ, కనీస గ్రామ సభ తీర్మానాలు చేయకుండా, హైడ్రో పవర్ ప్రాజెక్టులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం తగదన్నారు. ఆదివాసి గిరిజన మండల అధ్యుడు ఎంఎం శ్రీను మాట్లాడుతూ, అనంతగిరి మండలం టోకురు గ్రామ పంచాయతీ పరిధిలో చిట్టెంపాడులో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో జిల్లా కలెక్టర్ జీవో నెంబర్ 51 జారీ చేయడంపై ఆగ్రహం వ్యక్త పరచారు. ఆదివాసుల గిరిజన ప్రాంతంలో బడా కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో నిర్మాణాలు జరపనున్న హైడ్రోపవర్ ప్రాజెక్టు తక్షణమే నిలుపుద చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసి చట్టాలు హక్కులను రక్షించవలసిన ప్రభుత్వాలు, అధికారులు వాటిని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఇచ్చిన జీఓ 51 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పిసా సభ్యులు సుబ్బారావు, పద్మనాభం, నీలకంఠం, బాలు, బలరాం, గణపతి, తిరుపతి, నారాయణ, జయరాం, మల్లేష్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

పాఠశాలకు పక్కా భవనం మంజూరు చేస్తాం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - రంపచోడవరం : 'బడులిలా బలపం పట్టేదెలా' అనే శీర్షికతో 'ప్రజాశక్తి' దినపత్రికలో వచ్చిన కథనానికి రంపచోడవరం పిఒ సింహాచలం స్పందించారు. సోమవారం బొర్నగుడెంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పాకలో పాఠశాల నిర్వహిస్తున్నారని గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చారని, పక్కాభవనం ఏర్పాటుకు తగు చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంచి విద్య అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులందరికీ నోటుపుస్తకాలు, పుస్తకాలు మధ్యాహ్న భోజన పథకం అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలకు సంబంధించి ప్రతి పథకం పక్కాగా అమలు చేయాలన్నారు. విధుల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న పిఒ

తగ్గిన గోదావరి నీటిమట్టం

నిలకడగా గోదావరి

ప్రజాశక్తి- ఎటపాక : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం ఉదయానికి 18.4 అడుగుల వద్ద ఉంది. సాయంత్రానికి కాస్త తగ్గుముఖం పట్టి నిలకడగా ప్రవహిస్తోంది. అయితే శబరి ఉధృతితో వాగుల్లో వరద నీరు పోటెత్తింది. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తున్నాయన్న సమాచారం నేపథ్యంలో గోదావరికి వరద నీరు పెరిగే అవకాశం ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనలతో ఉన్నారు.

సమస్య పరిష్కారమయ్యేవరకూ పోరాటం

- రహదారుల నిర్మాణం చేపట్టాలి
- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు
- ఎంపిడిఒ కార్యాలయం ముట్టడించిన గిరిజనులు
- కార్యాలయం వద్దే వంటా వార్పు
- గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల హామీతో ఆందోళన విరమణ

ఎంపిడిఒ కార్యాలయం వద్ద బైఠాయించిన గిరిజనులు

కార్యాలయం వద్దే వంటా వార్పు నిర్వహించిన గిరిజనులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గిరిజన గ్రామాలకు రహదారులు పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద పలువురు గిరిజనులు ధర్నా నిర్వహించారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, గిరిజన సంఘం రాజవొమ్మంగి మండల అధ్యక్ష, కార్యదర్శులు కుంజం జగన్నాథం, కోండ్ల సూరిబాబు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక విద్యుత్ కార్యాలయం సమీపం నుండి ఎంపిడిఒ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాత్రి వరకూ అక్కడే బైఠాయించారు. సంబంధిత అధికారులు ఎంతకీ రాకపోవడంతో కార్యాలయం వద్దనే వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరరావు విషయం ఉన్నతాధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ అమ్మిరేకుల,డి మల్లవరం, బోరుగుపల్లి, జడ్డంగి నుండి వనకరాయి, పాకవెల్లి, జెమ్మిసావిడి నుండి సింగంపల్లి, కింద్రకాలనీ నుండి ముంజవరపాడు వెళ్లే గిరిజన గ్రామాల రహదారులు పూర్తి స్థాయిలో నిర్మాణపనులు చేపట్టాలన్నారు. తూతూమంత్రంగా పనులు కానిచ్చి అధికారులు, కాంట్రాక్టర్లు నిలిపివేశారని దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు లికిత పూర్వక హామీ ఇస్తేనే ఇక్కడి నుంచి కదులుతామని తమను అరెస్టు చేసిన పర్వాలేదని, సమస్య పరిష్కారమైతేనే కదులుతామని వందలాది మంది గిరిజనులు భీష్మించడంతో చివరికి గిరిజన సంక్షేమ శాఖ డిఇ గౌతమి రంపచోడవరం ఇఇ శ్రీనివాసరావుతో ఫోన్‌లో మాట్లాడి, వారం రోజుల్లో ఆయా గ్రామాల గిరిజనులతో మాట్లాడి రహదారుల నిర్మాణానికి కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గిరిజనులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. అధికారులు చర్యలు చేపట్టకపోతే తదుపరి కార్యాచరణ తీవ్రంగా ఉంటుందని లోతా రామారావు హెచ్చరించారు. ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఎంపిటిసిలు లోవలక్ష్మి, పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్ చంద్రుడు, దుర్గాప్రసాద్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సింగిరెడ్డి ఆచారావ్, ప్రవీణ్, గంగరాజు, కళావతి, సరోజిని గంగయ్యమ్మ, రెడ్డి వెంకటరెడ్డి, రాంబాబు, కోటేష్ పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్స్ మీట్‌ను జయప్రదం చేయాలి

▶▶ విద్యా ప్రమాణాలు మెరుగు పరడమే లక్ష్యం ▶▶ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈనెల 10 వతేదీన నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ మీట్ ను అన్ని యాజమాన్యాల విద్యా సంస్థల్లో విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని చెప్పారు. గిరిజన సంక్షేమాధికారులు, విద్యాశాఖాధికారులు, ఎంపిడి ఓలు, తహశీల్దారులు, అటవీ శాఖ అధికారులు, మెగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల తల్లిదండ్రులను మెగా పేరెంట్స్ మీట్‌కు ఆహ్వానించాలని చెప్పారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలపై తల్లిదండ్రులకు మీట్‌లో అవగాహన కల్పించాలని అన్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, లైబ్రెరీలు వంటి సదుపాయాలను కల్పించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో స్థానిక దాతల నుండి విరాళాలు సేకరించి పాఠశాలలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.మొక్కలు పంపిణీ ప్రక్రియ జరగాలని అన్నారు. ప్రతీ విద్యార్థి తల్లిపేరిట ఒక మొక్క నాటాలని చేసారు. తలిదండ్రులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మెగా పేరెంట్స్ మీట్కు నిర్వహణకు అన్ని పాఠశాలలకు నిధులు విడుదల చేసామన్నారు. నిధులను సక్రమంగా వినియోగించాలని ఆదేశించారు. స్థానిక ప్రజా ప్రతినిధులను మెగా పేరెంట్స్ మీట్ కు ఆహ్వానించాలని స్పష్టం చేసారు. కెరీర్ గైడెన్సుపై అన్ని పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు.ఈ సమావేశంలో పాడేరు ఐటిడిఏ పిఓ ఎం.జె. అభిషేక్ గౌడ, రంపచోడవరం ఐటిడిఏ పిఓ కె. సింహాచలం, డిఎఫ్ఓ పి.వి.సందీప్‌రెడ్డి, (వర్చువల్ గా) జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ఎపిసి స్వామినాయుడు, జిల్లా వైద్యాధికారి విశ్వేశ్వర నాయుడు గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్.రజని. ఎంపిడిఓలు, తహశీల్దారులు, మండల విద్యాశాఖాధికారులు, గిరిజన సంక్షేమాధికారులు, సహాయ ఇంజర్మీడియట్ విద్యా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

పాడేరు : గోదావరి, శబరి నదుల ప్రభావిత ప్రాంతాలలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం ఎటపాక, కూనవరం, చింతూరు, విఆర్ పురం ఎంపిడిఓలు, తహశీల్దారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. వరదలకు ఎటువంటి ప్రాణ నష్టం జరగకూడదన్నారు. ఇటీవల వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి, శబరి నధులు విస్తతంగా ప్రవహిస్తున్నాయన్నారు. గోదావరికి ప్రధమ హెచ్చరిక, శబరి నదికి మొదటి, రెండవ ప్రమాద హెచ్చరికలు జారీ చేసారన్నారు. తహశీల్దారులు, ఎంపిడిఓలు ముందస్తు చర్యలు చేపట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. వరదలపై ప్రజలను అప్రమత్తం చేయాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో ఎంపిడి ఓలు, తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఎటపాక: ఎటపాక మండల కేంద్రంలో హై స్కూల్ ఏర్పాటు చేసి విద్యా సౌకర్యాలు మెరుగుపరచాలని,ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు మాధవరావు కోరారు. పర్యటనలో భాగంగా ఎటపాక వచ్చిన ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిని స్థానిక సిపిఎం నాయకులు కలిశారు. ఆమెకు వినతిపత్రం అందించారు. ఎటపాకలో బ్యాంకు, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని, శాశ్వత సచివాలయ భవనాలకు నిధులు కేటాయించాలని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పోలవరం బ్యాక్‌వాటర్‌తో ముంపునకు గురవుతున్న ఎటపాక గ్రామాన్ని పోలవరం ముంపు బాధితుల జాబితాలో చేర్చి నష్టపరిహారం ఇప్పించాలని, అప్రకటిత కరెంటు కోతలను నిరోధించాలని, గోదావరి మంచినీరు ప్రజలకు అందించాలన్నారు. మండల కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు కార్యక్రమంలో ఆకిశెట్టి రాము, సుధాకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వార్డు మెంబర్

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలో పోక్స్ పేట పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సమక్షంలో వైసిపి నుండి వార్డు మెంబర్‌గా గెలుపొందిన పోడియం రాజన్నదొర సోమవారం టిడిపిలోకి చేరారు. ఆయనతో పాటు వైసిపి సీనియర్ నాయకులు కారంబాపన్నదొర, శ్రీనివాస్ తదితరులను ఎమ్మెల్యే శిరీషదేవి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చిన్నంబాబు రమేష్, జిసిసి డైరెక్టర్ గొర్లె సునీత, టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు, వై.నిరంజన్ దేవి తదితర నాయకులు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - సీలేరు: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డి.కె.హిమబిందు అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తమర్భ విశ్వేశ్వరనాయుడు ఆదేశాల మేరకు దారకొండ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల లో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థుల కు సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్స్‌డేకి ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖా ధికారి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ మేరకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు వర్షంలో తడవరాదని, వ్యాధులకు గురైతే వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని, మెరుగైన చికిత్స చేయించుకోవాలన్నారు.

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ హిమబిందు

అసత్య ప్రచారం చేస్తే సహించం

మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షుడు బాలరాజు

మాట్లాడుతున్న ఆచంట శ్రీనివాస్

ప్రజాశక్తి - రంపచోడవరం : మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి టిడిపిపై లేనిపోని వ్యాఖ్యలు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని రంపచోడవరం టిడిపి మాజీ మండల అధ్యక్షులు అడబాల బాలరాజు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో సూపర్‌సిక్స్ పథకాల్లో ప్రతిదాన్ని అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే శిరీష కూడా నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే శిరీషదేవి అవినీతి ఊబిలో కురుకుపోయారని అనడం సరైనపద్ధతి కాదని ఆధారాలు ఉంటే చూపించి మాట్లాడాలని నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తే రంపచోడవరంలో తిరగనివ్వబోమని హెచ్చరించారు.

నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదు

విఆర్‌పురం: మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే శిరీషదేవిపై నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని టిడిపి మండల కమిటి అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్ హెచ్చరించారు. రేఖపల్లి టిడిపి కార్యాలయంలో సోమవారం మండల కమిటి ప్రధాన కార్యదర్శి బురక కన్నారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

IN THE COURT OF THE HON'BLE SPECIAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (MOBILE) cum 3RD ADDL. JUNIOR CIVIL JUDGE COURT : ELURU

I.A. 132/2022 in O.S. 356/2021

Between:

NELAPATI ADINARAYANA ...Plaintiff

and

D3 : THIRRI SUBHA PRAVEEN, S/o. Thirri Parvathi (Died), Hindu, Age 29 Years, Employee,R/o. Near Anganwadi Centre, Donkarayi Village, Rajavommangi Mandal, Alluri Sitharamaraju District, A.P.

D4 : ALLA BHASKARA MANI, S/o. Not Known, Hindu, Male, Age 62 Years, R/o. Near Anganwadi Centre, Donkarayi Village, Rajavommangi Mandal, Alluri Sitharamaraju District, A.P.

...Defendants (D3, D4)

పై నెంబరు I.A. 132/2022 in O.S. 356/2021 శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందుపై శ్రీ కోర్టువారు మీకు ఈ I.A. నోటీసులు పేపరు ప్రకటన ద్వారా అమలు పరుచుటకు ఆర్డరు వేసియున్నారు. కావున మీరు శ్రీ కోర్టువారి ఎదుట **ది. 15-07-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు గానీ, మీ తరపున ప్లీడరు గారి ద్వారా గానీ స్వయముగా హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియచేయగలరు. లేని యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమున తీర్మానం చేయగలరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

CH. శ్రీనివాసరావు

అడ్వకేట్, ఏలూరు

ఏలూరు

ది.07-07-2025

సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు మండలం డి.గొందూరులో ల్యాండ్ స్కేప్ పరిధిలో శుక్రవారం రైతులకు సబల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యాన మొక్కలు పంపిణీ చేశారు. ఆగ్రో ఫారెస్ట్రీ మోడల్ లో భాగంగా గిరిజన ప్రాంతంలో ఖాళీగా ఉన్న పోడు భూములు గుర్తించి సబల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రైతులకు మామిడి, నేరేడు, సపోట, సీతాఫలం, జామ, టేకు మొక్కలు పంపిణీ చేశారు. అల్లూరి జిల్లా సబల్ ప్రాజెక్టు ప్రోగ్రాం ఆఫీసర్ నాయుడు, సిసిలు సత్యనారాయణ, ప్రకాష్, మాణిక్యం, పీసా కమిటీ మెంబర్లు, ఆర్ వైఎస్ఎస్ టీం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జి.మాడుగుల, అనంతగిరి మండలాల్లోనూ రైతులకు మొక్కలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. నేల క్రమక్షయం అరికట్టడం, జీవవైవిద్యం పెంచడం, రైతుల జీవనోపాధి పెంచడం ఆగ్రో ఫారెస్ట్రీ మోడల్ ప్రధాన లక్ష్యమని వివరించారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న సబల్ ప్రాజెక్టు ప్రోగ్రాం ప్రతినిధులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

దుంబ్రిగుడలో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

దుంబ్రిగుడ: ఈనెల 9న జరిగే కార్మికుల అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ పోతురాజు కార్మికులకు పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం కోరుతూ సోమవారం మండల కేంద్రంలో బుక్ లెట్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌బి పోతురాజు మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేసి నాలుగు కార్మిక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న జరిగే అఖిలభారత సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సూర్యనారాయణ, సురేష్ కుమార్, దొంబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: హెచ్‌ఎన్‌టీసీలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 9న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నాయకుడు సాగిన చిరంజీవి కోరారు. సోమవారం హెచ్‌ఎన్‌టీసీని ఆయన సందర్శించి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 9న కార్మికులందరూ పాల్గొని తమ హక్కుల సాధన కోసం ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. డైలీ వేజ్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబానికి ఒక్కరికి ఉద్యోగావకాశం కల్పించి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎన్‌టీసీ కార్మికులు పాల్గొన్నారు.

చింతపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

అనంతగిరి: దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అనంతగిరిలో విఆర్‌ఎలకు సిఐటియు మండల కన్వీనర్ కిల్లో సమ్మె కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ మండల నాయకులు, వీఆర్‌ఏల సంఘం నాయకులు మహేష్, లింగమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో ప్రచారం చేపడుతున్న నాయకులు

విఆర్ పురం: కార్మిక హక్కులకు వ్యతిరేకంగా తీసుకు వస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 11 కార్మిక సంఘాలు కార్మికులకు వ్యతిరేకంగా జరిగే ప్రభుత్వవిధానాలను నిరసిస్తూ కార్మిక చట్టాలను సవరించి లేబర్‌కోడ్‌ రూపంలో తీసుకురావడం అన్యాయమని కావున సమ్మెకు సిపిఎం పూర్తి మద్దతు ఇస్తుందని గ్రామాల్లో ఉన్న కార్మికులు, ఉపాధి కార్మికులు, రైతులు, కూలీలు అంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సోయం చినబాబు, పూనెం ప్రదీప్‌కుమార్, పోడియం శ్రీరామమూర్తి, రాజు, కారం సత్తిబాబు, గొంది దారయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు ఏపి కాఫీ రైతు సంఘం మద్దతు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: దేశవ్యాప్తంగా ఈనెల 9 జరుగుతున్న కార్మిక సమ్మెకు ఆంధ్రప్రదేశ్ కాఫీ రైతు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ నాయకులు గెమ్మెలి చిన్నబాబు ప్రకటించారు. సోమవారం అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో కాఫీ రైతు జాతీయ నాయకులు గెమ్మెలి చిన్నబాబు, అల్లూరి జిల్లా నాయకులు పాలికి లక్కు మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, పరిరక్షణ కోసం ఈ నెల 9న జరుగుతున్న జాతీయ కార్మిక సమ్మెకు ఆంధ్రప్రదేశ్ కాఫీ రైతు సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకువేలి మండల కాఫీ రైతు సంఘం నాయకులు సిహెచ్ గురుమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాఫీ రైతు సంఘం నేతలు

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మగ్గన్న

షాపింగ్ కాంప్లెక్స్‌ను నిరుద్యోగులకు కేటాయించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం కేంద్రంలోని పెదలబుడు పంచాయతీ సచివాలయం 2 పరిధిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పారదర్శకంగా గిరిజన నిరుద్యోగులకు కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కొర్ర మగ్గన్న డిమాండ్ చేశారు. సోమవారం పెదలబుడు 2 లో నిర్వహించిన గ్రామసభలో వార్డు సభ్యులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పలు సమస్యలపై లేవనెత్తారు. పెదలబుడు పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పారదర్శకంగా గిరిజన నిరుద్యోగులకు కేటాయించాలని కోరారు. వార్డు సభ్యులు కిల్లో నాగరాజు పేరుతో బందెలదొడ్డి స్థలంలో గ్రామసభ తీర్మానం లేకుండా ఇల్లు నిర్మాణం ఎలా చేస్తారని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా పెసా ఉపాధ్యక్షులు కిల్లో జగన్నాథం, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకుడు కొర్ర మగ్గన్న మాట్లాడుతూ, షాపింగ్ కాంప్లెక్స్, బందెలదొడ్డి స్థలంలో నిర్మించిన ఇళ్ల పెదలబుడు పంచాయతీ పూర్తి అధికారం పెదలబుడు పంచాయతీకే ఉండాలని, నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పెదలబుడు పంచాయతీ పరిధిలో గల 23 గ్రామాలకు చెందిన గిరిజన నిరుద్యోగులకు కేటాయించేందుకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు పెసా కమిటీ సభ్యులు, పాలకవర్గం శాశ్వత కాదని, ఎన్నికలు జరిగితే వ్యక్తులు మారే వీలే పాలక వర్గం ఎప్పుడుతుందని తెలిపారు. వ్యక్తుల పేరుతో పంచాయతీ ఆస్తులు మార్పు వ్యాపారం చేస్తామంటే గిరిజనులు ఊరుకోరని ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

దెబ్బతిన్న కారు

కారు, ఆటో ఢీకొని పలువురికి గాయాలు

ప్రజాశక్తి- అనంతగిరి: కారు ఆటో ఢీ కొన్న ఘటనలో ఆటోలో ఉన్న ప్రయాణికులు పలువురికి తీవ్ర గాయాలైన ఘటన అనంతగిరి ఘాట్ రోడ్డు మర్దగుడ కాపీ ప్లాంటేషన్ మలుపు వద్ద చోటుచేసుకుంది. అరకు నుండి విశాఖపట్నం వెళ్తున్న కారు, ఆటో మలుపు వద్ద ఎదురెదురుగా రావడంతో ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సుమారు ఎనిమిది మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం అదే ఆటోలో స్థానిక ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఈ ఘటనపై పూర్తి సమాచారం తెలియవలసి ఉంది

నారింజవలసలో పాఠశాల ఏర్పాటు చేయరూ..

పాఠశాలకు నడిచి వెలుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయితీ నారింజ వలస గ్రామంలో పాఠశాల లేక పోవడంతో ఆ గ్రామ విద్యార్థులు చదువుకోవడానికి సుమారు కిలోమీటరు దూరంలో పోతంగి పంచాయితీ పంతల చింత గ్రామంలో నడిచి వెళ్లి చదువు కుంటున్నారు. ప్రతిరోజు కిలోమీటరు దూరం నడిచి రాకపోకలు చేసి చదువుకోవడానికి విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారు అరకు పాడేరు ప్రధాన రహదారి 516 ఈ జాతీయ రహదారి కి ఆనుకుని ఈ గ్రామాలు ఉన్నాయి. నారింజ వలసలో పాఠశాల లేక పోవడంతో పంతలచింత గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులు చదువుకుంటున్నారు. నారింజ వలస గ్రామం నుంచి సుమారు పదిమంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతిరోజు హైవే రోడ్డు మీదుగా నడుచుకొని వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. హైవే రోడ్డు కావడంతో పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం ఉండడంతో నిత్యం ఈ రోడ్డు గుండా ప్రయాణికుల, పర్యాటకుల వాహనాలు రద్దీగా ఉంటున్నాయి. అటువంటి సమయంలో విద్యార్థులు నిత్యం కాలినడకన నడుచుకుంటూ చదువుకోవడం ఇబ్బంది పడుతున్నారని అంటున్నారు. వర్షాకాలంలో మరింత ఇబ్బందులు పడుతున్నారు.

వరదల సమయంలో మెరుగైన వైద్యసేవలందించాలి

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలో గోదావరి వరదల సమయంలో రేఖపల్లి, రాయిగూడెం ఆసుపత్రుల్లో మండల ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా వైద్య సిబ్బంది పని చేయాలని ఎంపిపి కారం లక్ష్మి సూచించారు. సోమవారం రేఖపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వరద సమయంలో అత్యవసర మందులు స్టాక్ ఉంచుకోవాలని జిల్లా అధికారులతో మాట్లాడి మందులు తెప్పించుకోవాలన్నారు. సీజన్లో వచ్చే వ్యాధులు పట్ల హెల్త్ క్యాంపులు పెట్టి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న పిఒ సింహాచలం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 83 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించి వ్యక్తిగత సమస్యలకు సంబంధించి వినతులు స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించి సంబంధిత అధికారులకు పంపుతామని ఐటిడిఎ పిఒ సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎపిఒ జనరల్ రమణ పాల్గొన్నారు. ఈ వారం 83 అర్జీలు వచ్చాయని పిఒ తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - మోతుగూడెం : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్ఐ సాధిక్ హెచ్చరించారు. చింతూరు మండలం, కొత్తపల్లి పంచాయతీలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తపల్లి పంచాయతీ వేములరాయిలో సోమవారం ఎస్ఐ సాదిక్, సిబ్బంది సందర్శించి, గ్రామస్తులతో మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం, విక్రయించడం నేరం అని అదేవిధంగా గంజాయి రవాణా చేయడం, సాగుచేయడం నేరమని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులకు దుస్తులు పంపిణీ చేశారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ సాధిక్

నేటి నుంచి సత్యసాయి కార్మికుల సమ్మె

దేవీపట్నం- ప్రజాశక్తి : సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న 52 మంది కార్మికులు తమకు 19 నెలలుగా రావాల్సిన వేతనాలు చెల్లించాలని 8వ తేదీ నుంచి సమ్మెబాట పట్టనున్నారు. సోమవారం ఈ మేరకు ఇందుకూరుపేట పంపుహౌస్‌లో జనరల్‌బాడీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకున్నారు. సమ్మెకు సంబంధించి ముందుగానే అధికారులకు, కాంట్రాక్టర్లకు నోటీసు పోస్టల్‌లో పంపామని ఎవరూ స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. మంగళవారం జీరో అవర్స్ నుంచి సమ్మె ప్రారంభిస్తామని, మొదటిరోజు గోకవరంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి రాజమండ్రి లాలా చెరువు వద్ద ఉన్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం వరకూ పాదయాత్ర నిర్వహిస్తామని సత్యసాయి కార్మికులు తెలిపారు.

పి4లో 10 వేల మంది మార్గదర్శులను గుర్తించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పి-4 విధానానికి అధికారులు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి పని చేయాలని, జిల్లాలో ఇప్పటికే గుర్తించిన బంగారు కుటుంబాల అవసరాలను తెలుసుకోవాలని, వారిని దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చే మార్గదర్శులను వారంరోజుల్లో గుర్తించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులకు పి-4 సర్వేలో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. పారిశ్రామిక సంస్థలు, అధికారులు కూడా పి-4లో భాగస్వామ్యం కావాలన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములను ఎస్సీలకు కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివో 596కు విరుద్ధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రీ హోల్డ్ చేసిన 6 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తిరిగి అర్హులైన ఎస్సీలకు కేటాయించాలని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విస్తత దళిత సంఘాల ఐక్యవేదిక (విదసం) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ, విశాఖ భూకుంభకోణంపై సిట్ నివేదికలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములు ఎస్సిలు,ఎస్సిలకే అమ్మేలా జిఒ సవవరించాలని, శారదా పీఠం నుండి తీసుకున్న భూమి రాందేవ్ బాబాకు ఇవ్వరాదని, మల్లం సాంఘిక బహిష్కరణపై కేసు పెట్టాలని కొంతమంది వక్తలు కోరారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, భాగం గోపాలరావు, సోడదాసి సుధాకర్, కె చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న దళిత సంఘాల ఐక్యవేదిక సభ్యులు

ఆర్‌టిసి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తులసీరామ్ డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపిఎస్‌ఆర్టిసి పిటిడిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్, అద్దెబస్సు, కాల్ ఆన్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఎపిఎస్ ఆర్టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వి.తులసిరామ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎపిఎస్‌ఆర్టిసి (పిటిడి)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు, అద్దెబస్సు, కాల్‌అన్ డ్రైవర్లకు ఒకే యూనిఫార్మ్ గా జీతాల విధానాన్ని డిపోలలో అమలు జరగడం లేదన్నారు. లేబర్ హాలిడేస్,క్యాజువల్ లీవులు ఎవరికీ అమలు పర్చటం లేదన్నారు. ఎండి, డిపోలు,నాన్ ఆపరేషనల్ యూనిట్ల సమస్యలపై అధికారులకు అనేక దఫాలు వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. కానీ సమస్యలు పరిష్కారం కాలేదని, అలాగే ఆర్టిసిలో కాంట్రాక్టర్ల సంఖ్య అధికంగా ఉందన్నారు. అద్దెబస్సు ఓనర్లు,ఆర్టీసి యాజమాన్యం డ్రైవర్లకు ఎటువంటి కార్మిక చట్టాలు వర్తింపజేయటం లేదని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మద్దిలపాలెం డిపోలో రిజర్వేషన్ కౌంటర్లలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేసిన ఇద్దరు మహిళా కార్మికులను కాంట్రాక్టర్ నరేష్ విధుల నుండి తొలగించి 9 నెలలు కావస్తున్నా వీరికి రావాల్సిన వేతనం కూడా నేటికీ చెల్లించలేదని పైగా వీరు కాంట్రాక్టర్‌కు కట్టిన డిపాజిట్ సొమ్ము రూ.60 వేలు తిరిగి చెల్లించలేదని తక్షణమే వీరి బకాయి వేతనం, డిపాజిట్ ను చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్, శాంతి భద్రతల మెరుగుదలకు చర్యలు

- హోం మంత్రి వంగలపూడి అనిత

ట్రాఫిక్ సిబ్బందికి ఎసి హెల్మెట్లు, ద్విచక్ర వాహనాలు, డ్రోన్‌ల అందజేత

డ్రోన్లను పరీక్షిస్తున్న మంత్రి అనిత

మహిళా పోలీస్‌కు ఎసి హెల్మెట్ పెడుతున్న మంత్రి అనిత

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: విశాఖనగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టడంలో భాగంగా విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ చొరవతో పలు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీలతో పైలెట్ ప్రాజెక్టులు నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా విశాఖ నగరంలో అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని రూ.46 వ్యయంతో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ వారు 100, సౌత్ ఏషియా ఎల్పీజీ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ వారు 100 ఏసీ హెల్మెట్లను సోమవారం విశాఖ నగరంలోని ట్రాఫిక్ సిబ్బందికి అందజేయడం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఏసీ హెల్మెట్లు ఒకసారి మూడు గంటలు చార్జింగ్ చేసి ధరించినట్లయితే సుమారు 8గంటల పాటు నిరంతరాయంగా పనిచేస్తాయని అత్యధిక టెక్నాలజీతో తయారు చేయబడిన పాలి ప్రొఫైల్ కో-పాలిమర్‌తో తయారు చేయడం జరిగిందని ఫలితంగా బయట ఉష్ణోగ్రత కంటే ఎనిమిది డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రత నుండి వస్తుందని తెలిపారు.

ట్రాఫిక్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే క్రమంలో ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 64 ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ సిబ్బందికి అందజేయడం జరిగిందని, దీనివల్ల నగరంలోని వివిధ ఏరియాల్లో ట్రాఫిక్, శాంతిభద్రతలు మరింత మెరుగుపరిచేందుకు అవకాశం ఉందన్నారు. అదేవిధంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ వారి సహకారంతో నాలుగు డ్రోన్లు విశాఖపట్నం పోలీసులకు అందజేశామని, వీటి విలువ రూ. 17 లక్షల వరకు ఉంటుందని ఈ డ్రోన్ల సహాయంతో నిర్మానుష్య ప్రదేశాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలను అదుపు చేయుటకు ఉపయోగపడుతుందన్నారు వీటితో పాటు హెచ్‌పిసిఎల్ యాజమాన్యం వారు సిఎస్సార్ నిధుల కింద రూ.17.6 లక్షల విలువ గల గోద్రెజ్ కంపెనీకి చెందిన రెండు కంపాక్టర్స్‌ను అందజేశారన్నారు.

టిడిపి నేతల కనుసన్నల్లోనే మాదక ద్రవ్యాల మార్కెట్

- డ్రగ్స్‌కు అడ్డాగా ఎపి: కెకె రాజు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రాష్ట్రం గంజాయి, డ్రగ్స్‌కి అడ్డాగా మారిపోయిందని వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి టిడిపి నేతల కనుసన్నల్లోనే రాష్ట్రంలో మాదకద్రవ్యాల మార్కెటింగ్ విచ్చలవిడిగా జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి నుంచి ప్రమాదకరమైన డ్రగ్స్ వరకూ నేడు ఎపి ఒక హబ్‌గా మారిపోయిందన్నారు. మాదక ద్రవ్యాల కేసుల్లో పట్టుబడుతున్న టిడిపికి చెందిన వారిని కాపాడేందుకే ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొకైన్ వంటి మాదకద్రవ్యాలు కూడా చాలా సులభంగా అందుబాటులో ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందన్నారు. మొన్న విశాఖలో 25 గ్రాముల కొకైన్‌ని ప్రభుత్వ యూనివర్సిటీ సమీపంలో పట్టుకున్నామని పోలీసులే వెల్లడించారు. ఈ డ్రగ్స్ కేసులో టిడిపి నాయకులకు అనుచరులుగా ఉన్న కొంతమందికి సంబంధం ఉందని, వారిని తప్పించేందుకు అమాయకుల్ని ఒప్పించి బలిచేశారనే ప్రచారం జరుగుతోంది.

ఎల్‌జి పాలిమర్స్ బాధితులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎల్‌జి పాలిమర్స్ బాధితులు అందరికీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పాలిమర్స్ బాధితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ విక్టిమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి వి. శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ 2020 మే7న జరిగిన ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదంలో బాధితులైన చాలా మందికి, ఐదేళ్లు గడిచినా పరిహారం అందలేదన్నారు. ఈ విషయమై ఐదు సంవత్సరాలుగా గత ప్రభుత్వంలో 'స్పందన' కార్యక్రమంలో, ఇప్పటి కూటమి ప్రభుత్వంలో 'పిజిఆర్‌ఎస్' కార్యక్రమంలో పలుమార్లు విన్నవించామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి గొన్నాబత్తుల చంద్రశేఖర తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనుల కారణంగా పలు రైళ్ల రద్దు

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: వాల్తేరు డివిజన్‌లోని కోటబొమ్మాళి స్టేషన్‌లో అధునాతన ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థను ప్రారంభించడంతో భద్రతకు సంబంధించిన ఆధునీకరణ పనుల కారణంగా, జులై 11 వ తేదీన పలు రైలు సర్వీసులు రద్దు చేయటం జరిగిందని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో 58506 విశాఖపట్నం-గుణుపూర్ ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్ 58505 గుణుపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్‌ప్రెస్, 58532 విశాఖపట్నం-బ్రహ్మపూర్ ప్యాసింజర్, 58531 బ్రహ్మపూర్-విశాఖపట్నం ప్యాసింజర్, 22819 భువనేశ్వర్ - విశాఖపట్నం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 22820 విశాఖపట్నం-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 67289 విశాఖపట్నం-పలాస ప్యాసింజర్, 67290 పలాస-విశాఖపట్నం ప్యాసింజర్, 18526 విశాఖపట్నం-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ ,18525 బ్రహ్మపూర్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లను 2025 జులై 11 న రద్దు చేసారు.

ఎయు ప్రొఫెసర్‌కు గ్లోబల్ రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ మేకా జేమ్స్ స్టీఫెన్, పరిశోధన సామాజిక ఆవిష్కరణలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ప్రతిష్టాత్మక నెక్సస్‌సినర్జీ అవార్డ్స్ 2025లో 'గ్లోబల్ రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు' లభించింది. జూలై 4న జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవం సమ్మిళిత అభివృద్ధిని పెంపొందించడానికి సాంకేతికతను సామాజిక అవసరాలతో అనుసంధానించడంలో ఆయన చేసిన కృషిని గుర్తించి అందించారు. డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్, సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వశాఖ, ప్రొఫెసర్ స్టీఫెన్ కృషిని ప్రశంసించింది. అనంతరం పోలాండ్‌లోని బైడ్‌గోస్జ్‌లోని డబ్ల్యుఎస్‌జి యూనివర్సిటీలో జరిగిన ప్రతిష్టాత్మక స్ప్రింగర్ అంతర్జాతీయ సదస్సు 'నెట్‌వర్కింగ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఎక్స్‌పర్ట్ అప్లికేషన్స్ అండ్ సెక్యూరిటీ'-2025 లో ముఖ్య వక్తగా ప్రొఫెసర్ మేకా జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ దీనిలో భాగంగా అభివృద్ధి చేయబడిన ఒక నమూనా అప్లికేషన్ విశాఖపట్నం జిల్లా, పెందుర్తి మండలంలోని ఐదు గ్రామాల్లో విజయవంతంగా అమలు చేయబడిందన్నారు.

అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ జేమ్స్‌స్టీఫెన్